# మౌనానికి మాటొచ్చింది

***(24-8-2005 "నవ్య" ఆంధ్రజ్యోతి ప్రచురణ, తానా 2005)***

"లెగవ్వే లెగు... నువ్వేవన్నా రాజికుమారీననుకుంతన్నావా? ఇంకా తొంగున్నావు!" తిట్ల మేలుకొలుపుతో పాటూ వీపుమీద చరిచిన దెబ్బతో ఉలిక్కిపడి లేచింది మునెమ్మ.

ప్రతిరోజూ తిట్లస్తోత్రంతో వీపుమీద దరువుతో నిద్రలేపుతుంది సింహాచలం కూతుర్ని. పదేళ్ల మునెమ్మ కళ్ళు నులుపుకుంటూ లేచి తను పడుకున్న చింకిచాప. కప్పుకున్న పాత చీర మడిచి వారగా పెట్టి బయటికొచ్చింది. ఇంకా చీకట్లు విడలేదు. చేతిలో కచ్చిక పొడేసుకుంటుంటే గండు చీవొచ్చింది అరచేతిలో. దాన్ని కిందపడేసి గొంతుక్కూచుని చేతిలో పొడితో పళ్ళు తోవుకుంటూ అదెటు పోతుందా అని దాన్నే చూస్తోంది.

వెనకనించొచ్చి నెత్తిమీద గట్టిగా ఓ పోటుపొడిచింది సింహాచలం.

"పల్లు తెల్లగా పావుకుంటా కూసుంటే పనికెవడుపోతాడే? పాచిపనికి పోత న్నావా? సినేమాలో ఏసేందుకుపోతన్నావా?" వెనకనించి తోసినతోపుకి ముందుకి తూలి చేతిలోపొడి ఒలికిపోడవే కాక నోట్లో ఉన్నపొడిమూలంగా దగ్గుకూడా వొచ్చింది మునెమ్మకి.

గబగబా ఇన్నినీళ్ళు నోట్లో పోసుకుంది. చలి..చలి... పుక్కిలిపట్టి ఉమ్మేసి లేచిందక్కడినించి.

చిన్న సబ్బుముక్క వేళ్లసందుల్లోంచి జారిపోతుంటే అతి జాగర్తగా మొహంరుద్దుకుంది... చల్లనీళ్ళు... చలికాలం... వొణుకొస్తోంది.. వొంటినున్న

గొనుతో మొహం తుడుచుకుంటుంటే దానికున్న చిరుగు ఇంకాస్త పెద్దదైంది. చేత్తో తలవెంట్రుకలు వెనక్కితోసుకుని మళ్ళీపాకలోకి నడిచింది. రాత్రి తాగిన గంజి ఓ చుక్కయినా ముంతలో ఉందేమోనని అత్యాశకి పోయి. తొంగి చూసింది ముంతలోకి.

"లేసినావోలేదో మేతకోసం సూస్తావుకదే! తిండిపోతు మొహవా?" తల్లి అరుపుతో తలొంచుకుని బయటికి నడిచింది.

"దిక్కులు సూసుకుంటాపోకు. ఓ నిమిటాలీసెం సేసినా ఆ యమ్మ అగ్గిలా మండిపడతాది"

వెనకనించి తల్లి పెట్టేకేక రోజూ ఆ చెవులు వినేదే చలికి వొణుకుతూ చేతులుకట్టుకుని చకచకా అడుగులు వేస్తూ జగదాంబ గారిల్లు చేరింది. వెనకవైపు నుంచి పెరట్లో కెళ్లి బక్కెటుతో నీళ్ళూ చీపురూ అందుకుని వీధిగుమ్మానికొచ్చింది మళ్ళీ.

చలికి పళ్ళు గిట్టకరుచుకుపోతుంటే 'ఉహూ ఉహుహూ' అనుకుంటూ చీపురెయ్యడం మొదలెట్టింది.

పాలగిన్నెతో ఇంట్లోకెళ్తున్న పక్కింటి పనికుర్రాడు కొండయ్య గోడమీంచి మునెమ్మని చూసి ఈలేసాడు.

మునెమ్మకిది రోజూ ఉండే భాగోతవే.

రోజూలాగే తలెత్తలేదు. చూపుతిప్పలేదు.

"అబ్బో... పేద్ద.... అయిస్వర్రారాయ్ననుకుంతాది. యిజిలేసినా సూడదు. యినిపించుకోదు" తుప్పుకునాపక్క ఉమ్మేసి లోపలికెళ్ళి పోయాడు కొండయ్య.

తనూ ఇటుపక్కన తుపుక్కునుమ్మేసి కళ్ళాపి చల్లడం, ముగ్గెయ్యడం పూర్తిచేసి పెరట్లో కెళ్ళిపోయింది మునెమ్మ.

గిన్నెలు కడుగుతుంటే వేళ్ళు కొంకర్లు పోయినట్టవుతోంది.

గాజు కప్పులో వేడివేడిగా కాఫీ తాగుతూ... వేసుకున్న స్వెట్టర్‌పైన శాలువాతో పెరటిగుమ్మానికొచ్చింది ఇంటి యజమానురాలు. తలెత్తి ఓసారి అమ్మ

గారివంక చూసి మళ్ళీ తన పన్లో లీనమైపోయింది మునెమ్మ. పనికొచ్చేటప్పుడు ఇంట్లో చూసిన ఆ ఖాళీ ముంతే కళ్ళముందు కనిపిస్తోంది. రాత్రి తాగిన ఆ కాస్త గంజీ రాత్రి పడుకునేలోపలే కడుపులో ఏవైపోయిందో తెలియదాయె!

అంట్ల గిన్నెలపని పూర్తయ్యేసరికి మంచినీళ్ళొస్తున్నాయి పంపులో.

గబగబా పట్టి నింపుతోంది అన్నిటిల్లోనూ. వంటింట్లో బిందెలు నింపాలి ప్లాస్టిక్ డ్రమ్ములు నింపాలి. బరువుతో గుమ్మాలు దాటుతుంటే కాలికొట్టుకుని పడబోయి నిలదొక్కుకుంది... జివ్వుమంది కాలు... మంట.. చూసుకుంటే నెత్తురొస్తోంది బొటనవేలుకి.

"ఏవిటి కూచిపూడి ఆడుతున్నావా? అంత కులుకుతూ పన్లు చేస్తే అయినట్టే కానీ... కానీ..." అమ్మగారి అదిలింపుకో తెలియదు.. కాలినెప్పికో తెలియదు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మూగమొద్దులా మాటాడవుగానీ... నటించడం బాగానే చేతనవు నీకు... ఓయబ్బో! చాలా మందినే చూశా నీలాంటివాళ్ళని... ఇట్టే పసిగట్టె య్యగలను వేగిరం కానివ్వుపని... పొద్దున్నే ఇంటి దగ్గిర చద్దన్నాలు లాగించి పన్లోకొస్తే ఇలాగే ఉంటుంది మరి.."

అమ్మగారి మొహంలోకి నీరసంగా చూసింది మునెమ్మ.

"మింగేసేలా ఆ చూపు చూడు. బెదిరిపోతాన నుకున్నావుటే నువ్విలా చూస్తే. నీళ్ళుపట్టడం అవగానే వొచ్చి నా కాళ్ళకి తైలం మర్దనా చెయి." సరేనన్నట్టుగా తల ఊపింది.

"గట్టిగా రాయితైలం.. ఓపికలేనట్టు ఏవిటంత నాటకం. ఇంట్లో ముప్పొద్దులా మెక్కుతా వుటాగా? మీ అమ్మ చెప్పిందిలే... అందుకే ఇక్కడ నీకు అన్నం గానీ టిఫినీగానీ ఏవీ పెట్టక్కర్లేదని ఆ వారడి కూడా డబ్బుల్లోనే ఇమ్మని జీతం మాటాడుకుని పట్టుకుపోతోందిగా మీ అమ్మ నెలనెలా"

"మునెమ్మా"

"అదుగో అయ్యగారు పిలుస్తున్నారెందుకోచూడు"

"ఈ పక్క బాత్‌రూమ్ రోజూ సాయంత్రాలు కడుగుతావుగా? అంత గొప్పగా కడిగావే? కాలుజారుతోందక్కడ... మళ్ళీ ఇంకోసారి రుద్ది కడుగు..."

అటువైపు నడిచింది మునెమ్మ.

"నిన్న సాయంత్రం మునెమ్మ బాగానే కడిగింది. అదెళ్లాక మన గడుగ్గాయి సర్ఫు ఒలకపోశాడక్కడ... పైగా బబుల్సే గబుల్సే ఆడాడక్కడ."

మాటలు పైకి అన్లేదు జగదాంబ. అంటే తన గారాలబిడ్డడికి తిట్లుపడవూ నాన్నచేత!

గదులూడుస్తున్న మునెమ్మ పిల్లల గదిలోకి రాగానే మంచాలవైపు చూసింది.

పిల్లలిద్దరూ మెత్తటి పరుపుల మీద రజాయిల్లో మునగదీసుకుని నిద్దరోతున్నారు.

అమ్మాయి పదకొండేళ్లది... అబ్బాయి తొమ్మిదేళ్ళవాడు.

వాళ్ల మంచాల దగ్గరగా ఊడుస్తున్నప్పుడు ఆ మెత్తటి పరుపులు ముట్టుకోవాలనిపిస్తుంది మునెమ్మకి. అయినా ముట్టుకోదు... చెయ్యి వెనక్కి లాక్కుంటుంది.

డ్రెస్సింగ్ టేబుల్ ముందునించి వెళ్తుంటే అద్దంలో చూసుకోవాలనిపిస్తుంది.

"నీ అందానికి అద్దం కూడానా?" అమ్మగారు వెనకనించి అరిచినట్టనిపిస్తుంది.

చూసుకోదు... తలొంచుకుంటుంది. గదిమూలల్లో ఊడిచేటప్పుడు మూలకి నిలబెట్టివుంచిన బ్యాటు పుచ్చుకుని ఆడాలనిపిస్తుంది.

"తమ్ముళ్ళయితే మొగ మొహారాజులు... నువ్వాడగుంటవి మర్చిపోమాకు"

అమ్మ నెత్తిన మొట్టినట్టనిపిస్తుంది. తల తడుము కుంటుంది.

అక్కా తమ్ముడూ ఆ గదంతా ఇష్టవొచ్చినట్టు పడేసిన పుస్తకాలన్నీ సద్ది ఓ పక్కన పెడుతుంటే బడికి పోవాలనిపిస్తుంది. చదువుకోవాలనిపిస్తుంది

మరింత వొంగిపోతుంది వీపు.

"ఏవిటే అంత సేపూడుస్తున్నావా గది ? తొరగా బయటికిరా. పిల్లలు లేచిపోతారు. చప్పుడైతే... అదిగో అమ్మాయి కదుల్తోంది.. పడుకో తల్లీ అప్పుడే లేవనక్కర్లేదమ్మా" కూతురికి రజాయి మళ్ళీ నిండుగా కప్పింది జగదాంబ

లెగులెగు రాజికుమారీనను కుంతన్నావా ఇంకా తొంగున్నావు... అమ్మ అరుపు వినిపిస్తోంది మునెమ్మకి...

ఈయమ్మగోరు మంచోరు సల్లో... అప్పుడే లెగ వద్దంటోంది పిల్లల్ని.

వొచ్చే జలమలో ఈయమ్మ నాకు అమ్మయితే?

"ఏవిటే మొహం అలా పెట్టావు? నాకు తెల్సు... ఎప్పుడూ నన్ను తిట్టుకోవడమే నీపని... ఎక్కువపన్లు చేయించేస్తున్నానా నీ చేత ? రేపట్నించీ నాకూ, నా కూతురికీ కూడా తల రుద్దాలి నువ్వే తెల్సిందా? అప్పుడుగానీ నీ తిక్క కుదరదు. 'రెండు బాదైనా సరే మీక్కావల్సిన పన్లన్నీ సేయించుకోండమ్మా' అంది మీ అమ్మ డబ్బు పారేస్తున్నప్పుడు చేయించుకోమా మరి? ఎవడి కోసం చేస్తావ్?

మౌనమే సమాధానంగా పన్లన్నీ పూర్తి చేసుకుని పక్కింటికి నడిచింది మునెమ్మ. ఇంకా ఎదురిల్లు కూడా చెయ్యాలి. మూడిళ్ళల్లోనూ పన్లు ముగించుకుని ఇల్లు చేరేసరికి... ఇంతన్నం ఉడకేసక్కడపెట్టి తన పన్లకి తను బయల్లేరుతోందమ్మ. జర్మన్‌సిల్వర్ డబ్బాలో అన్నం సద్దుకుంది పట్టికెళ్ళేందుకు.

"ఒసే! అల్లిద్దరూ తిన్నాక మిగిలింది నువ్వుతిను. ముందే నువ్వు మెక్కికూసోకు" సింహాచలం పనికెళ్ళేటప్పుడు రోజూ పాడే పాటే ఇది.

"అన్నంపెట్టెహె.. ఆడుకోవాల"

తమ్ముళ్ళిద్దరూ వొచ్చికూచున్నారు ధడాలున... "అన్నంతిని బడికి పోరాదా? సదూకుంటె ఆపీసులో పని చేసుకోవొచ్చు. అమ్మని సుక పెట్టొచ్చు. నాన్నలేడుగా మనకి!" ఈ మాటలు మునెమ్మ నోట్లో రోజూ ఆడతాయి. బయటికిరాలేవు... వొచ్చే శక్తి వాటికి లేదు. గబగబా ఇద్దరికీ అన్నం వొడ్డించి.. పచ్చడి.. ఉల్లిపాయ ముక్కలు వేసింది వాళ్ళు తింటుంటే తను ప్లాస్టిక్ బిందె తీసుకుని రోడ్డుకటువైపున్న బోరింగ్ పంపు దగ్గిరకి నడిచింది.

"ఏవే! మునెమ్మా! ఏళ్ళు నెత్తి మీదికొచ్చినయి. చిరుగ్గోనేసుకుని తిరుగుతావు... సిగ్గనిపిస్తల్లేదానీకు?"

నీళ్ళు కొడుతుంటే... నడుమ్మీదో చెయ్యి బుగ్గనో చెయ్యి పెట్టుకుని విడ్డూరంగా అడిగింది అప్పుడే అక్కడికొచ్చిన రంగమ్మ.

ఒకసారి తలపైకెత్తి చూసి మళ్ళీ తలదించుకుని బలం ఉపయోగించి కొట్టే పన్లో పడిపోయింది మునెమ్మ.

"ఔనుగానీ ఒసే! మీయమ్మ ఆపోలయ్యతో సంబందవెట్టుకుందటనే! ఇలాటియి దాసిపెడితే దాగుతాయా? నాకంతా తెల్సు"

అర్థంకాలేదు మునెమ్మకి చివుక్కున తలెత్తింది... బిత్తర చూపులు చూసింది.

"అబ్బో! అమ్మాయికంగా సూడక...నీవొయిస్సులో నేను కాపరానికిపోయినా."

మౌనంగా నీళ్ళబిందెతో ఇంటివైపు నడిచింది మునెమ్మ.

ఆ నీళ్ళు కడవలోపోసి మళ్ళీవొచ్చింది బోరింగ్ దగ్గిరకి.

బైట తొట్టెనిండా నీళ్ళు నింపాలి... బట్టలుతకాలి..

నాపరాయి మీద బట్టలు పడేసుకుని చకచకా ఉతకడం మొదలెట్టింది.

చేతులు భుజాలు లాగేస్తున్నాయి.

అలుపుతీర్చుకుందుకన్నట్టు ఒక్కనిమిషమాగింది.

వెనకనించొచ్చాడు పైడయ్య... నాలుగైదుపాకల అవతలుంటాడు.

ఈ సమయంలో మునెమ్మ ఒక్కతే ఇంట్లో ఉంటుందని వాడికి తెల్సు.

"నాతో రారాదూ... పట్నం తీసుకుపోతా... కట్టాలన్నీ గట్టెక్కిపోతాయి నీకు"

చేతిలో బట్ట గట్టిగా బాదింది మునెమ్మ.

నీళ్ళు చిమ్మాయి పైడయ్య మొహమీద్మ వాడి కళ్ళెర్రబడ్డాయి.

"తూ... నీకెంత పొగరే! ఏంసూసుకుని ఆ తలబిరుసు?" మునెమ్మ రెక్కపుచ్చుకుని విసురుగా పైకిలేవదీశాడు. ఎప్పటినించో దాని మీదోకన్నేసుంచిన పైడయ్య... వాళ్ళమ్మ దాన్నెలా చూస్తుందో తెల్సు... అందుకే వాడో ప్లాన్లో ఉన్నాడు. పట్నం తీసుకుపోయి ఆ శివంగికి అమ్మితే రెండువేలిస్తుంది.

"ఏంటలా సూత్తవ్? పట్నంలో నిన్ను రానీగార్ని సేత్తా. ఇక్కడ మీ అమ్మకాడుంటే అంట్లుతోవుకుంటా బట్టలుతుక్కుంటా... మీ తమ్ముళ్ళు తినగా మిగులూతగులూ ఉంటే తినడం లేకుంటే పస్తులుంటం ఇదేగా నీ బతుకు!"

పైడయ్య చేతిలోంచి తన చేతిని లాక్కుంటూ రెండో చేత్తో ఓ తోపు తోసింది వాడిని.

ఊహించలేదు వాడు... వెనక్కిపడ్డాడాతోపుకి.

అవమానంతో... కోపంతో... మీదిమీది కొచ్చాడు నానాతిట్లూతిడుతూ సరిగ్గా అప్పుడే అటువైపువెళ్తూ పైడయ్యని చూసి ఆగాడు వాడి మేనమావ.

"ఏంట్రా? ఈడేం సేస్తున్నావ్?"

"ఎవరూసూడకుండా నన్నీడకి రమ్మని రగస్యంగా కవురెట్టినాదీ మునెమ్మ"

"ఓసినీ! ఎంతకి తెగించినావే? నా కూతుర్ని సేసుకోబోతున్న నా మేనల్లుడి మీద పడిందానీ కన్ను? చిన్నగుంటవి నీకిదేంబుద్దే? నా పిచ్చిగానీ... మీయమ్మ బుద్దేవొచ్చింది నీకు... దాని గునం మంచిది కానప్పుడు నీదెట్టా అవుతాది? పాడుజలమ... ఎందుకే? పదరా!"

తలొంచుకుని ఎంతో బుద్ధిమంతుళ్ళా మేనమావతో వెళ్ళిపోయాడు పైడయ్య బట్టలుతికి ఆరేసొచ్చి ఇంటిముందు బండరాయి మీద కూచుంది మునెమ్మ.

"నే సెప్పానా మీ యమ్మ పోలయ్యతో సంబంధం ఎట్టుకుందనీ.. మా పిన్నమ్మ సెప్పింది మీయమ్మకి బిడ్డ పుట్టబోతోందని... నీ బతుకింకా నరకం అవుతాదిలే.." ఎకసెక్కెం చేస్తూ మునెమ్మ ముందునించి వెళ్ళింది రంగమ్మ.

సింహాచలానికి నెలలు నిండాయి. తను పన్చేసే ఇళ్ళక్కూడా మునెమ్మనే పంపిస్తోంది. కానుపుతేలిగ్గానే అయ్యింది. ఆడపిల్ల పుట్టింది.

"సూడూ... పైడయ్య సెప్పిందీ బానే ఉంది... మునెమ్మని ఆడెంట పట్నం పంపడవే రైటు. ఎయ్యి రూపాయిలిత్తానంటన్నాడు మనకి... డబ్బు సేదొచ్చిందా నీకు? పోయి దానిబతుకది బతుకుతాది... ఏదో ఏడవనీ. దాని పెళ్లి సేసేబాద తప్పుతాది కదా నీకు? ఇప్పుడీ పసిగుడ్డుని పెద్ద సేసుకురావొద్దా? మొగవెదవలిద్దర్నీ మెకానిక్ సాపులో పనికెట్టేత్తాను." పోలయ్య తన నిర్ణయం చెప్పేశాడు ఓ రోజు.

"సరే... రాత్రొచ్చి మునెమ్మని తీసకపోమని సెప్పు పైడయ్యకి"

చంటిపిల్లని చాపమీద పడుకోపెడుతూ అంది సింహాచలం.

వెయ్యి రూపాయిలు కళ్ళముందు కనపడుతుంటే సంతోషంగా బయటికెళ్ళి పోయాడు పోలయ్య.

పుళ్ళడిపోయిన చేతుల్ని అవి పెట్టే మంటల్ని ఏ మాత్రం లెక్క చెయ్యకుండా చంటిపిల్లపక్క బట్టలు సంతోషంగా ఉతికారేసొచ్చి... పిల్లని ప్రేమగా దగ్గిరకి తీసుకుంది మునెమ్మ.

"అమ్మా"

"ఏంటే" నోరిప్పిన కూతురివంక వింతగా చూసింది సింహాచలం.

"సెల్లాయిని సక్కంగా సదివిద్దావే... బడికి పంపిద్దావే...నాలాగా పనుల్లో సేర్పెయ్యకే అమ్మా! నేనింకో నాలుగిళ్ళు ఎగస్టాసేసి శానా డబ్బులు పోగేత్తానే.. సెల్లిని పెద్దపెద్ద సదూలు సదివిద్దాం. ఎర్ర లంగా ఎర్రజాకిటూ ఏసుకుని ఎర్ర రిబ్బెన్లు కట్టుకుంటే ఎంత బావుంటాదో ఎవురికైనా సరే. సెల్లాయికి ఎర్రలంగా ఎర్రజాకీటూ కుట్టిచ్చి ఎర్రరిబ్బెన్లు కొను." భయంభయంంగా తల్లివంక చూస్తూ బతిమాలే ధోరణిలో.. మొదటిసారి నోరు విప్పింది మునెమ్మ.

సింహాచలం మనసులో... ఎక్కడో ఓ మూల... కలుక్కుమంది.

అది చాలు అరంభానికీ... ఆలోచన రేకెత్తడానికీ, పేగు కదలడా నికీ...కన్నప్రేమ ముందు కాసుల మైకం జారిపోవడానికీ...

★ ★ ★